క్లుప్తంగా

రేపు ఉపాధి పనులపై గ్రామ సభలు

సింహాద్రిపురం : మండల కేంద్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఉపాధి పనులపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతులు తమకు ఉపయోగపడే ఉపాధి పనులను సంబంధిత గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ లేదా పంచాయతీ సెక్రటరీల వద్ద పనులు రాయించుకోవాలన్నారు. అలాగే పంచాయతీ పరిధిలోని ప్రజా ప్రతినిధులు కూడా గ్రామసభల్లో పాల్గొని గ్రామ అభివృద్ధికి తోడ్పడే ఉపాధి పనులను గుర్తించి గ్రామ సభలలో తెలపాలన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

సింహాద్రిపురం : అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక వైఎస్ రాజారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బోటనీ, జువాలజీ అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం ఉత్తీర్ణులైన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 28వ తేదీన డెమో క్లాసులు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీలోని విజయగార్డెన్‌లో జరిగిన వివాహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సుంకర వెంకటసుబ్బయ్య కుమారుడు గంగాధర్, రేవతిల వివాహానికి వైఎస్సార్‌సీపీ నేతలు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, తొండూరు మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డిలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధరరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, వైఎస్ జగన్ వ్యక్తిగత కార్యదర్శి రవిశేఖర్, ఎంపీ వ్యక్తిగత కార్యదర్శి రాఘవరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జులు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి, లింగాల మండల నాయకులు బాబురెడ్డి పాల్గొన్నారు.

మానవత శాంతి ర్యాలీ

ఎర్రగుంట్ల : పట్టణంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శాంతి ర్యాలీని నిర్వహించారు. సంస్థ చైర్మన్ రఘురామిరెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ ఎస్. రామాంజనేయ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, మండల విద్యాధికారి శివప్రసాద్‌లు పావురాలను ఎగుర వేసి ర్యాలీని ప్రారంభించారు. మానవత మాజీ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. దాత కల్లూరు గంగాధర్ రెడ్డి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.


వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతి



కారపురెడ్డి ఓబుల్‌రెడ్డి (ఫైల్)

పెండ్లిమర్రి : కారపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కారపురెడ్డి ఓబుల్‌రెడ్డి(89) బుధవారం తెల్లవారుజామున తిరుపతిలోని ప్రైవేట్ అసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పలుమార్లు సర్పంచ్‌గాను, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడిగా పనిచేశాడు. కారపురెడ్డిపల్లెలో అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మాజీ మంత్రి మైసూరారెడ్డి తనయుడు, ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజోలి వీరారెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై మృతదేహానికి నివాళి అర్పించారు.

వేంపల్లె ఎస్‌ఐగా రంగారావు



వేంపల్లె : వేంపల్లె ఎస్‌గా రంగారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న రంగారావు వేంపల్లెకు రెండవ ఎస్‌ఐగా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఎస్‌ఐ రంగారావు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతే కేసులు నమోదు చేస్తామన్నారు.

పోలీసుల శ్రమదానం

లింగాల : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు లింగాల ఎస్‌ఐ సిబ్బందితో శ్రమదాన కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం లింగాల హైస్కూల్, బీసీ బాలుర వసతి గృహాల ఆవరణలో కంపచెట్లు, వ్యర్థపదార్థాల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జర భద్రం..



సంకేపల్లె గ్రామ సమీపంలో కాజ్‌వేను దాటుతున్న ప్రజలు

కొండాపురం : మండలంలోని సంకేపల్లె - బందలదిన్నె గ్రామాల మధ్యలో బుధవారం పెన్నానది కాజ్‌వేపై ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో కాజ్‌వేను దాటడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాజ్‌వే రోడ్డులో ప్రమాదకరస్థాయిలో లోతైన గుంతలు ఉండటంతో ప్రజలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. కొంతమంది బైకులలో కాజ్‌వేపై నీటిలో వెళుతూ కిందపడుతున్నారు. అలాగే కాజ్‌వే పక్కన చేపలు పట్టేందుకు నీటిలో దిగుతున్నారు. దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అనంతపురం జిల్లాలో గత మూడురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పెన్నానది ద్వారా దాదాపు 1200 క్యూసెక్కుల వరదనీరు గండికోట జలాశయంలోకి వచ్చిచేరుతోంది. నదిపరీవాహక ప్రాంతాల్లో ప్రమాదాలు జరగక మునుపే పోలీసులు, రెవెన్యూ అధికారులు తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తుప్పు పడుతున్నాయి..

పులివెందుల రూరల్ : వివిధ రకాల కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలంపాట వేయకపోవడంతో వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ తుప్పుపట్టి ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. వాటిని పట్టించుకున్న నాథుడే లేరు. వాహనాలు సక్రమంగా ఉన్నప్పుడు వేలంపాట నిర్వహిస్తే అటు ప్రభుత్వానికి, ఇటు వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. కానీ సంబంధిత అధికారులు వాహనాలకు వేలంపాట నిర్వహించకపోవడంతో ఇలా తుప్పుపట్టి ఎందుకు పనికిరాకుండా పోలీస్ స్టేషన్‌లో ఉన్నాయి.



పోటెత్తిన కుందూ



నెమళ్లదిన్నె గ్రామం వద్ద వంతెనపై ప్రవహిస్తున్న కుందూ నది

పెద్దముడియం : కర్నూలు జిల్లాలో భారీ వర్షాలు కురవడం, శ్రీశైలం జలాశయం నుంచి దిగువకు నీరు వదలడంతో కుందూ నది వరద నీటితో పోటెత్తుతోంది.

మండలంలోని నెమళ్లదిన్నె గ్రామం వద్ద కుందూ నీరు వంతెనపై అడుగు మేర ప్రవహిస్తున్నాయి. దీంతో అవతలివైపున ఉన్న గ్రామాలకు రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ అధికారులు వంతెనపై రాకపోకలు సాగించవద్దని హెచ్చరికలు జారీ చూశారు. ప్రస్తుతం కుందూ నదిలో 13,500 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని అధికారులు తెలిపారు.

జలజీవన్ మిషన్ పనులు పూర్తయ్యేలా చూడండి

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ శ్రీకాంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీకాంత్‌రెడ్డి

వేముల : మండలంలోని గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలోని సభాభవనంలో బుధవారం ఎంపీపీ చల్లా గంగాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి కుళాయి అమర్చి తాగు నీరు అందించేందుకు గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులను చేపట్టారన్నారు. ఇప్పటికే గ్రామాల్లో సర్వే పూర్తి చేశారన్నారు. గ్రామాల్లో అక్కడక్కడ మిగిలిన జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేయాలన్నారు. అలాగే ఖరీఫ్‌లో సాగుచేసిన అన్ని రకాల పంటలకు ఈ పంట నమోదు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇ పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్న విషయాలను రైతులకు వివరించాలన్నారు. రైతులకు 50 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్ పైపులు ఇస్తున్నారని, సద్వినియోగం చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. మండల వ్యాప్తంగా గృహనిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు గృహ సిబ్బంది లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద సన్న, చిన్నకారు రైతులు చీనీ, నిమ్మ, మామిడి, జామ, సపోట, డ్రాగన్ తదితర పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకు వచ్చేలా చూడాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న రైతులందరు అర్హులేనని, 5ఎకరాలలోపు ఉన్న రైతులకు పండ్లతోట పెంపకంపై ముందుకు వచ్చే వారిని ప్రోత్సహించాలన్నారు. అలాగే 23వ తేదీ నుంచి గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికపై గ్రామ సభలు జరుగుతాయన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నచోట వెంటనే పరిష్కరించాలని ట్రాన్స్‌కో జేఈ దినేష్‌కు ఎంపీడీఓ శ్రీకాంత్ సూచించారు. గ్రామాల్లో పశువులకు సోకుతున్న గాలికుంటు వ్యాధి పట్ల రైతులను అప్రమత్తం చేయాలని సకాలంలో టీకాలు వేసేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నపిల్లల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారి సునీతకు సూచించారు. అనంతరం అన్ని శాఖల పనితీరుపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇందిరా రాణి, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, మండల కోఆప్షన్ సభ్యులు మండి మాపీరా, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు ఆర్‌డబ్ల్యూస్ ఏఈ శివారెడ్డి, పీఆర్‌ఏఈ అబ్దుల్లా, ఆర్‌అండ్‌బీ ఏఈ గణేష్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ రామసూరారెడ్డి, పశువైద్యాధికారి శశికళ, ఏపీఓ నాగసులోచన, ఏపీఎం మంజునాథ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

బొప్పాయి రైతులకు ప్రోత్సాహం



బొప్పాయి పంటను పరిశీలిస్తున్న హెచ్‌వో

ముద్దనూరు : బొప్పాయి పంట సాగుచేస్తున్న రైతులకు ఉద్యానశాఖ రాయితీ అందిస్తోందని ఉద్యాన శాఖాధికారి మల్లేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఉప్పలూరు గ్రామంలో సాగులో వున్న బొప్పాయి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ అధికారి మాట్లాడుతూ బొప్పాయి పంట సాగు చేయాలనే ఆసక్తి వున్న రైతులు గానీ ఇప్పటికే పంట సాగుచేస్తున్న రైతులకు కూడా రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన విస్తరణ పథకం కింద 1 హెక్టారుకు రూ.18,500లు చొప్పున రాయితీ అందిస్తుందని, ఆసక్తి గల రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

ముద్దనూరు : మండలంలోని తిమ్మాపురంలో పలు పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు వేశారు. జమ్మలమడుగు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరక్టర్ వెంకట్రామిరెడ్డి, స్థానిక పశువైద్యాధికారి శ్రీనివాస్ తమ సిబ్బందితో కలిసి టీకాలు వేశారు. నాలుగు నెలలు దాటిన దూడలకు, గేదెలకు, ఆవులకు, ఎద్దులకు ఈ టీకాలు వేసినట్లు వారు తెలిపారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రాని వారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సబ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

సామాజిక తనిఖీ పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : మండలంలో 2023–24లో చేసిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సామాజిక తనిఖీ బృందంతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో 2023–24లో జరిగిన ఉపాధి పనులు అలాగే జనవరి నుంచి జూన్ వరకు సంక్షేమం కింద మంజూరు చేసిన పెన్షన్‌ల తనిఖీ పక్కాగా చేపట్టాలన్నారు. తనిఖీలో పాటించాల్సిన అంశాలపై బృందానికి ఆమె అవగాహన కల్పించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, ఉపాధి కూలీలతో కలసి ప్రతి గ్రామంలో జరిగిన ప్రతి పనులను క్షుణ్ణంగా పరిశీలించి తనిఖీలు చేపట్టాలన్నారు. ఈనెల 24 నుంచి 31వ తేదీ వరకు గ్రామాల్లో పర్యటించి పనులు తనిఖీ చేస్తామని, అనంతరం నిర్వహించే ఓపెన్ ఫోరం తనిఖీల్లో వెలుగు చూసిన విషయాలను వెల్లడిస్తామని ఎస్ఆర్‌పీ భాస్కర్ తెలిపారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ శారదారెడ్డి, ఏపీఓ పార్థసారధి, డీఆర్‌పీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

కమలాపురం : వరి పంటలో సస్య రక్షణ చర్యలు చేపట్టి పంటకు ఆశించిన తెగుళ్లను నివారించి అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణ పరిధిలోని కె.అప్పాయపల్లెలో సాగు చేసిన వరి పంటను ఆయన పరిశీలించారు.

కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగు ఆశించాయని గుర్తించారు. కాండం తొలుచు పురుగు పిలకలు వేయు దశలో ఆశించినప్పుడు కాండపు కింది భాగాన్ని నమిలి తినడం వలన మొవ్వ ఎండిపోవడం జరుగుతుందన్నారు. దీనిని డెడ్ హార్ట్ అంటారని వివరించారు. అలాగే కంకి దశలో ఆశించినప్పుడు తెల్ల కంకులు ఏర్పడుతాయని, దీని ద్వారా పంటకు ఎక్కువ నష్టం జరుగుతుందన్నారు. ఆకు ముడత పురుగు ఆశించినప్పుడు ఆకులకు గొట్టంగా చేసి పత్రహరితాన్ని గోకి తినడం వలన ఆకులు తెల్లబడి ఎండి పోతాయన్నారు. ఆకులను చీల్చి చూస్తే అందులో లార్వాలు కనబడతాయన్నారు. కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగు నివారణకు నాట్లు నాటిన 15 రోజుల తర్వాత 3జీ కార్బో ఫ్యూరాన్ గుళికలు 10 కిలోలు లేదా 4జీ కార్టప్ హైడ్రో క్లోరైడ్ 6 నుంచి 8 కేజీలు ఏకరానికి వేసుకోవాలన్నారు. పురుగు మందులు పిచికారికి గాను 2 గ్రాముల కార్టప్ హైడ్రో క్లోరైడ్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసి కాండం తొలుచు పురుగు, ఆకుముడత పురుగును నివారించ వచ్చని ఏడీఏ వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, రైతులు పాల్గొన్నారు.

సమాజ సేవే మానవత ధ్యేయం

వల్లూరు (చెన్నూరు) : సమాజ సేవే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ధ్యేయమని సంస్థ కేంద్ర డైరెక్టర్ డాక్టర్ రామాంజనేయరెడ్డి తెలిపారు. మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం చెన్నూరు పురవీధుల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు.

అనంతరం బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో 2004 సంవత్సరంలో మానవతా సంస్థ ఆవిర్భవించి రాష్ట్ర వ్యాప్తంగా 119 శాఖలతో 69,000 మంది సభ్యులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సీఐ పురుషోత్తం రాజు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మలు విద్యార్థులకు అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మ కోసం ఒక మొక్క



మొక్కలు నాటుతున్న డీన్, తదితరులు

పులివెందుల టౌన్ : స్థానిక ఫుడ్‌సైన్స్ కళాశాలలో అసోసియేట్ డీన్ మాధవ ఆధ్వర్యంలో బుధవారం ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మపేరుతో ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో నేరేడు మొక్కలు నాటారు. మొక్కలు నాటడటం వల్ల సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి అందులో అమ్మపేరుతో ఒక మొక్క అనే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

వేంపల్లె : కోల్‌కత్తా ట్రైనీ జూనియర్ మహిళా డాక్టర్‌పై హత్యాచారం, హత్యసంఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆర్కేవ్యాలీ విద్యార్థులు, యాజమాన్యం బుధవారం ఎస్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డిలు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని స్వీయరక్షణతో, తప్పించుకునేలా ఉండాలని, అదేవిధంగా విద్యార్థులు సమాజంలోని స్త్రీలపట్ల గౌరవ భావం కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ అమరేంద్ర, సెక్యూరిటీ ఆఫీసర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : పశ్చిమబెంగాల్‌లో శిక్షణ పొందుతున్న వైద్యురాలిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ పట్టణ క్యాదర్శి దాసరి విజయ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి ఏవో తిరుపతయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సంఘటన జరిగి పదిరోజులు కావస్తున్నా ఇంతవరకు నిందితులను పట్టుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం విచారకరమన్నారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జి నైతిక బాధ్యత వహిస్తూ తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో ఇ-పంట నమోదు పూర్తిచేయండి

వేముల : ఖరీఫ్‌లో సాగుచేసిన అన్ని రకాల పంటలకు సకాలంలో ఇ-పంట నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఏఓ చెన్నారెడ్డి సిబ్బందికి సూచించారు. మీదిపెంట్ల రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న ఇ-పంట నమోదు ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఖరీఫ్‌లో సాగైన ప్రతి పంటకు ఇ-పంట నమోదు చేయాలన్నారు. దీనిపై రైతులు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 4,936 ఎకరాల్లో ఇ పంట నమోదు చేయడం జరిగిందన్నారు. ఇ పంటలో నమోదైన రైతులకు మాత్రమే పెట్టుబడి రాయితీ, పంటల బీమా వంటి పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు తమ పంటకు ఇ పంట నమోదు చేసుకున్న తర్వాతనే రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించే ఇ పంట జాబితాలో రైతు పేరు ఉంటేనే ఈకేవైసీ చేయాలన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల్లో లభించే పొటాస్, డీఏబీ కాంప్లెక్స్ ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ సంతోష్ రైతులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఇ-పంట నమోదు చేసుకోవాలి

లింగాల : ప్రతి రైతు ఇ పంట నమోదు చేసుకోవాలని ఏఓ రమేష్ సూచించారు. బుధవారం పెద్దకుడాల రైతు సేవాకేంద్రం పరిధిలోని రామన్నూతనపల్లి గ్రామంలో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. తుమ్మలూరు ఈశ్వర్‌రెడ్డి వేసిన వేరుశనగ పంటలో పంట నమోదును పరిశీలించి మాట్లాడుతూ ప్రతి రైతు కూడా సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదు ఆధారంగానే రైతులకు పంటల బీమా, పంట నష్టపరిహారం, వడ్డీలేని రుణాలు మొదలైన పథకాలకు అర్హులవుతారన్నారు. పంట నమోదులో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం సిబ్బంది మౌనిక, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం



మల్లికార్జునపురంలో రోడ్డుపై ఉన్న మురుగునీరు



యర్రబల్లెలో రోడ్డుపై ఉన్న చెత్తాచెదారాలు

పులివెందుల రూరల్ : మండలంలోని యర్రబల్లె, దళితవాడ, మల్లికార్జునపురం, తుమ్మలపల్లె, రాయలాపురం గ్రామాల్లో పారిశుద్ధ్య అధ్వానంగా తయారైంది. రోడ్లపైనే చెత్తాచెదారాలు, మురుగునీరు ప్రవహిస్తుండటంతో గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చెత్తచెదారాలు రోడ్ల పైనే ఉండటంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో చెత్తాచెదారాలు, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎస్సీ వర్గీకరణ రద్దుచేసే వరకు పోరాటం

జమ్మలమడుగు : ఎస్సీవర్గీకరణ రద్దుచేసేవరకు పోరాటం ఆగదని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రామోజీ ఇమ్మాన్యుయేల్ తెలిపారు. బుధవారం ఎస్సీవర్గీకరణకు వ్యతిరేకంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీవర్గీకరణ తిరిగి రద్దుచేసే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఎర్రగుంట్లలో బంద్

ఎర్రగుంట్ల : పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో ఏపీ రాష్ట్ర మాలమహానాడు ఆధ్వర్యంలో భారత్ బంద్‌ను నిర్వహించారు. రాజ్యాంగ వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణకు నిరసనగా దేశవ్యాప్తంగా బహుజన సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బంద్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు వాహనాలు నిలిచిపోయ్యాయి.

దోమల నివారణకు చర్యలు

ఎర్రగుంట్ల : దోమల నివారణకు చర్యలు చేపడితే వ్యాధులు దరి చేరవని చిలంకూరు హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి తెలిపారు. బుధవారం చిలంకూరులోని జేడ్పీ పాఠశాలలో విద్యార్థులకు దోమ కాటువల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం వారంలో ఒక్క రోజు డ్రైడేని పాటించాలని, దోమలు కుట్టకుండా దోమ తేరలు ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు